

# ఉద్యోగం పురుషలక్షణమ్

శ్రీమతి శిరుగూరి రత్నమ్మ

వెంకప్ప అవధాన్లగారిని ఎరుగని వారు ఎవ్వరూ లేరు. ఆయన పేరు ఒక్క అమలాపురంలోనే కాకుండా కోనసీమయావత్తూ ప్రసిద్ధి కెక్కింది. వెంకప్ప అవధాన్లు షోడశకర్మాధికారి. ప్రతి ఒక్కరూ ఆయన సలహా లేనిదే ఏపనీ చేయరు. కొబ్బరిచెట్టుకాయలు దింపుకుందుకు ముహూర్తంమొదలు తమ ఇంటి పెళ్లి ముహుర్తాల దాకా వెంకప్ప అవధాన్లు పెట్టవలసినదే. కోనసీమయావత్తూ పౌరోహిత్యం ఆయనదే. అవధానం చేయక పోయినా ఆయన తాతగారు అవధానం చేసి, అవధాన్లనిపించుకుంటే వారసత్వపు హక్కులాగ తాతగారి పేరు ఆయనకు వెంకప్ప అవధాన్లని పేరుమాత్రం సంక్రమించింది. ఈయన భుజశక్తివల్లనే అమలాపురంలో నాలుగిళ్లభవంతి కట్టేరు. ముగ్గురు కొడుకులలో పెద్దవాడయిన నీలకంఠం తండ్రివృత్తినే అవలంబించి తండ్రికి చేదోడువాదోడుగా వున్నాడు. రెండో కొడుకు పార్వతీశం 'స్కూలు ఫైనలు' పాసయి సర్వేఆఫీసులో గుమస్తాపని చేస్తూన్నాడు. మూడో కొడుకు గంగాధరం బి. యే పాసయి యేడాది అయింది. అతను పాసయేనాటికి బ్రాహ్మణ అబ్రాహ్మణ భేదం ప్రబలివుండడంనించి ఎక్కడా వుద్యోగం దొరకడంలేదు. ప్రతీ ఆఫీసులో ఖాళీలేద నేమాటే. పఠనమందిరంలో ప్రతీరోజు 'హిందూ' పేపరు చూచి *Wanted Columns* లో వున్న ఉద్యోగాలలో తాను చేయగలిగిన ప్రతి ఉద్యోగానికీ అప్లికేషన్లు పెట్టేడు. రాజమండ్రీకీ, అమలాపురానికీ ఆ వీథి ఈవీధిలాగ తిరుగుతూన్నాడు. చేయవలసిన ప్రయత్నాలన్నీ చేస్తూన్నాడు. ఫలితం శూన్యం. చివరకు కోమటిగుమాస్తా పనికూడా దొరకడం లేదు.

రెండుఝాముల ప్రొద్దయింది. వేసవి కాలం అవడంనుంచి సహస్రకిరణుడు తన ప్రభావం బాగా చూపిస్తూన్నాడు.

కమ్మగా వేయించిన కందిపప్పు,నప్పుళ్ళం కొత్తగా పూరేశిన పచ్చడిబద్దలు, కమ్మటి గేదపెరుగు వేసుకుని సుష్టుకృతుగా భోంచేసి గ్రుమని తేన్చుకుంటూ,తడిఅంగోస్త్రంతలమీద వేసుకుని వెంకప్ప అవధాన్లు ఇవతల కొచ్చేసరికి ఆ వూరి పెద్దకామందు కామరాజు, కుమార్తె పెండ్లిముహుర్తం పెట్టించుకుందామని వచ్చేడు. ఆయనను చూచి వెంకప్ప అవధాన్లు "రండి రండి ప్రభువులు ఇలాగ దయచేశారు. కాకిచేత కబురు పంపితే తమ లోగిటికి నేను వచ్చేవాడినిగదా! ఇంత ఎండలో తా మింత శ్రమపడివచ్చేరు."అనిఅన్నాడు.

"ఫరవాలేదు. కార్యావసరం వుండి వచ్చేను. మా మూడో అమ్మాయికి సంబంధం నిశ్చయమైంది. ఈజ్యేష్ఠ, శాఖాలలో మంచి ముహూర్తం వుందేమో కనుక్కుందామని వచ్చేను."

"ఓహో అలాగా చాలా సంతోషం. దయచేయండి సావిట్లోకూర్చుని సావకాశంగా ముచ్చటిద్దాం అమ్మాయి, అబ్బాయిగార్ల జాతకాలు తెచ్చారా?"

"ఆ. తెచ్చేను."

ఇద్దరూ ముందునా సావిట్లో పరచివున్న తాటాకుల చాపమీద కూచున్నారు.

వెంకప్ప అవధాన్లు "ఒరే బుల్లోడా" అని పెద్దకొడుకు కొడుకుని కేక పెట్టాడు. ఆ కేకవిని ఏడెనిమిదేళ్ళ కుర్రాడు పరుగెత్తుకొచ్చి 'తాతా పిలిచావా' అని అడిగేడు. "నా దస్త్రం పట్టుకురా" అని తాత చెప్పగానే ఆ పిల్లాడు ఒక్క పరుగుతో లోపలికి వెళ్ళి పంచాంగం కట్టివున్న దస్త్రం తెచ్చి ఇచ్చి ఆడుకుందుకు చక్కాపోయాడు.

వెంకప్ప ఒక పొడుంపట్టు పీల్చి చెయి చాపిన కామరాజు చేతిలో రవంత పొడుం రాల్చి పంచాంగకట్ట విప్పుతూండగా నిరాశాపూరితముఖంతో, రేగిన జుట్టుతో కాళ్ళీడ్చుకుంటూ మూడవకొడుకు గంగాధరం వీధివాకిలిదాటి లోపలికి వచ్చేడు. అతనిని చూచి కామరాజు "మన గంగాధరం గారికి ఉద్యోగ మేమయినా కలసి వచ్చిందా అండీ." అని అవధానగారిని ప్రశ్నించాడు. అసలే అవధాన్లగారికి మూడవకొడుకుని చూస్తే అరికాలిమంట నెత్తికెక్కుతుంది. తనలాగ పిలక పెట్టుకోకుండా క్రాఫింగు పెట్టుకున్నాడనీ, సంధ్యవార్చడనీ, ఇంగ్లీషు చదువు చదివేడనీ గంగాధరాన్ని చూచినప్పుడల్లా మండిపడుతూంటాడు. దానిమీద కామరాజు అలా గడిగేసరికి అగ్గిమీద గుగ్గిలంలాగ మండిపడి "ఆఁ కలసివస్తుంది. వీడికి వుద్యోగమిచ్చే దౌర్భాగ్యు డింకా పుట్టలేదు. ప్రొద్దున్నే దండించుకుని చద్దికణ్ణం పెట్టించుకుని తిని అది అరిగేదాకా దిమ్మదిరిగి వస్తాడు. వీడి మొఖాన చదువుకింద నాలుగువేలు తగలేశాను. ఈ తేళ్యం నాలుగు దమ్మిడీలు సంపాదించడం చేతగాక దేవులాడుతున్నాడు. ఏమిటో ప్రయత్నం చేస్తూన్నాడుట ప్రయత్నం. వీడి శార్ధం. నా కడుపున చెడబుట్టాడు. ఈ రోజుల్లో పొయిదగ్గర కూర్చోవలసిన ఆడవాళ్లు సహితం ఇట్టా ఉద్యోగాలు సంపాదించి మగరాయుళ్లను మించి ఉద్యోగాలు చేస్తూన్నారు." అని కామరాజుతో అన్నాడు.

కామరాజు జబాబేమి చెప్పలేదు. అలాగ ఎందు కలిగేను బాబూ అనుకున్నాడు మనసులో.

ముక్తేశ్వరందేవాలయంలో ఏవో పద్దులు వ్రాసే గుమస్తాపని ఖాళీ వచ్చిందంటే విని గంగాధరం గంపెడాశతో ప్రొద్దున్నే అచ్చటకు వెళ్ళేడు. అచ్చట అధికారివైష్ణవు డవడంచేత తనజాతివాడికి అప్పుడే ఆ పని ఇచ్చేశాడుట. గంగాధరం వెళ్లి అడుగుతే "అబ్బే! మాకు *B. A.* లూ, *M. A.* లూ ఎందుకండీ? ఏదో, లోవర్ సెకండరీ పాసయినవాళ్లయితే చాలు. అదీగాక ఆ పని అప్పుడే ఒకరికి ఇచ్చేయడమైంది. పాపం మీరు *B. A.* పాసయి ఇరవైరూపాయిలపనికొరకు వచ్చారంటె నాకు చాలా కష్టంగా వుంది." అని ఆ రామానుజస్వామి చెప్పేసరికి గంగాధరం కుప్పకూలినట్లు అయిపోయాడు. తప్పక తనకీ యిరవైరూపాయల ఉద్యోగం అవుతుందని కొండంత ఆశపెట్టుకు రాగా పూరంశ నిరాశ అయింది. వెళ్లినపని వాకిట్లోనే అయిందన్నట్లు లేదన్నమాట అనిపించుకుని అలో లక్షణా అని మళ్లీ కాళ్ళీడ్చుకుంటూ ఇంటిమొగం పట్టేడు. ప్రొద్దున్న పెద్ద వదినెగారు ముప్పయిమూడు సాధింపులతో వెక్కిరింపులతో, మూతి విరుపులతో పెట్టిన చద్దెన్నం అరిగిపోయింది. కడుపులో నకనక లాడుతూంది. ఆకలిబాధతో, ఎండదెబ్బతో బరువైన హృదయంతో కాళ్లీడ్చుకుంటూ వస్తూన్న గంగాధరానికి తండ్రి అన్నమాటలు శులాల్లా నాటాయి. 'నాజీవితం కన్న తండ్రికి కూడా ఇంత భారమైందే! నేనంటే ఎంత చులకనగా మాట్లాడుతూన్నాడు. పరాయి పెద్దమనిషి దగ్గర వున్నాడన్న సంకోచమైనా లేదు కదా!' అని అనుకుంటూ లోపలికి వచ్చిన గంగాధరాన్ని చూచి, "ఏంరా గంగాధరం నువ్వెళ్ళిన పని ఏమయింది? మామూలు పాటేనా? లాకేత్వం దాక్కొమ్మ." అని వెంకప్ప అవధాన్లు ప్రశ్నించాడు.

"ఆపని ఎవరికో అప్పుడే ఇచ్చేరుట" అని తలవొంచుకుని జబాబు చెప్పి లోపలికి వెళ్లిపోయేడు.

"లేకపోతే! నువ్వు ఉద్యోగం చేశావు. నేను చూసేను. నువ్వు సంపాదించావు నేను తిన్నాను. నాకడుపున ఎంత అప్రయోజకుడివి పుట్టావురా." అని కామరాజుతో 'ఇది వాడి తప్పు కాదు లెండి మా ఇంటావిడదే తప్పు. పెద్దాడిలాగ వీడికీ నాలుగు మంత్రంముక్కలు నేర్పుతానంటే ససేమిరా వల్ల కాదంటే వల్ల కాదని చదువుకొని వుద్యోగం వెలగబెట్టుతాడనీ ఈ ఇంగ్లీషుచదువులో పెట్టింది. సంపాదనా లేదు. చట్టుబండలూ లేదు. వట్టి త్యాష్టం కింద తయారైనాడు. ఏవో నాలుగుమంత్రం ముక్కలు నేర్చుకుని మీబోటి నాలుగిళ్లలో పౌరోహిత్యం చేసుకుంటే చాలదుటండీ" అని వెంకప్పావధాన్లు కామరాజుతో అన్నాడు.

'ఏదో శుభంగా కూతురు పెళ్లిముహూర్తం పెట్టించుకుందామని నేను వచ్చి ఈ తండ్రికొడుకుల తగవుమధ్య పడ్డానేమిటి భగవంతుడా! అతని వుద్యోగంమాట ఎందుకు ఎత్తేనురా తండ్రీ! అని మనస్సులో అనుకుని మౌనంతో తలవూపేడు కామరాజు.

లోపలకు వెళ్లిన గంగాధరానికి తన పెద్ద వదినెగారయిన సుబ్బమ్మ, తన భార్య శారదతో ఈవిధంగా అనడం వినిపించింది. సుబ్బమ్మ మేనరికం అవడంనుంచీ, పెద్ద కోడలు అవడంనుంచీ ఆ ఇంట్లో చనవూ అధికారం హెచ్చు. ఆమె అందరిమీద అధికారం చెలాయిస్తూన్నా అత్తగారు ఏమీ కలుగజేసుకోదు. అందునించి ఆమె మరీ విజృంభిస్తూంది.

"మీ దొరగారు ఎప్పుడు వస్తారో ఏమో? నీవు అన్నానికి వస్తావా? అతగాడికి పనా పాటా? ఏముంది? తిరగడమేగా ఉద్యోగం? పిల్లలబట్టలు ప్రొద్దున్నే సబ్బులో నానబెట్టి వుంచేను. నువ్వన్నం తిని మైలపడి బట్టలు ఏటికి తీసుకెళ్లి వుతికి తీసుకురావాలి. ఎండ మాటు వాలిపోతే బట్టలు తెల్లగా వుండవు. అల్లా చూస్తూ నీనించుంటావేం. ఆకు తెచ్చి వేసుకో. కన్నీ అమర్చిపెట్టడానికి ఎవరూ ఇచ్చట నీ నౌకర్లు సిద్ధంగా లేరు"

"వారు వచ్చేదాకా వుంటాను. ప్రొద్దున్నగా కాస్త చద్దన్నం తిని కాలినడకతో వెళ్లేరు. ఈ మండుటెండల్లో ఇంటికి ఏలాగ చేరుకుంటారో ఏమో! నా కేమీ తోచడం లేదు. బట్టలు ఇప్పుడే ఏటికి తీసుకెళ్లి వుతుక్కొస్తాను."

"ఏం, చద్దన్నం తిన్నాడు చద్దన్నం తిన్నాడని వూరికే వగచకపోతే అంత అభిమానం కలదానివి వేడివేడిగా వేపుడుకూర అన్నం చేసి అమర్చలేకపోయావా? కాలినడక గాకపోతే మోటారు కొనమను. దొరగారు రాందే ఈ దొరసానమ్మ తినదట. ఇప్పుడే ఇంత గీర్వాణంగా వుంది. రేపు ఆయనగారు నాలుగురాళ్లు సంపాదిస్తే ఇక క్రిందామీదా వుండదు. ఏమండీ శారదమ్మగారు మీవారు కలక్టరయితే కాస్త మావారికి ప్రమోషను ఇప్పిస్తారా అని హేళనగా రెండో తోడికోడలు రాజేశ్వరి అంది.

దానిమీద పెద్ద తోడికోడలు సుబ్బమ్మ "ఆఁ ఈ మొగాలే ఉద్యోగాలు చేయడం వూళ్లేలడం. బి. యే. పేసయి ఏడాదైంది. మూడు దమ్మిడీలు సంపాదించడం చేతకాక మిణుకుతూన్నాడు. మావారు చూడు నిక్షేపంలాగ స్వతంత్రంగా గడపుతున్నారు. వారిష్టముంటే వెళ్లుతారు లేకుంటే లేదు. ఒక అధికారిచేత చివాట్లు తినక్కరలేదు. గాడిదచాకిరీ చేయక్కరలేదు. తనకోసరం ఒకరు ఎదురు

చూడవలసిందే, కాని ఒకళ్ళకోసరం తాను ఎదురు చూడక్కరలేదు. అందరూ ఎంతో గౌరవం చేస్తారు. నిత్యపంట. అల్లా వీధులోకి వెళ్ళి ఇల్లా వచ్చేసరికి ఇల్లు నిండుతుంది. ఏముంది ఉద్యోగాల్లో? అందులో ఈరోజుల్లో జీతపురాళ్లు కడిగేశి పారేస్తారు. ఫస్టుతారీఖు ప్రభువులు, మరునాడు మామూలు సంసార్లు, మూడోనాడు ముష్టివాళ్లు. ఉద్యోగాలో అని ఎగబడుతారు. వీళ్లు తెచ్చే ముప్ఫయి నలభయి రాళ్లతో సంసారాలు గడుస్తాయా? సీతారామాభ్యాం నమః అని అష్టోత్తరీ జపించేసరికి ఉళ్లున తవ్వెడు బియ్యం తప్పేలా చెంబులో ఒలకవలసిందే. ఉద్యోగాలలో ఏముంది? పైకి బటారం, లోపల లొటారం", అని అందుకుంది. పాపం వయస్సులోనూ అనుభవంలోనూ చిన్నదయిన శారద వీళ్ళ మాటలకు జవాబు చెప్పలేక మౌనం దాల్చి, ఆ మిడిమధ్యాహ్నపు ఎండలో బావగారి పిల్లల బట్టలు వుతకడానికి ఏటికి వెళ్ళింది. కాలిన ఇసుకలో కింద కాళ్లు అంటుకుంటున్నాయి. పైన మాడు మాడుతోంది, కడుపులో తోడికోడళ్లు చెప్పిన దెప్పుళ్లకు బాధగావుంది. వాళ్లకు జవాబు చెప్పే అధికారం తనకు లేదు. వాళ్ళు ఎన్ని మాటలంటూన్నా పడి పూరుకోవలసినదే. తన పుట్టింటివారు వా రిద్దరు పుట్టింటివారికన్న చాలా భాగ్యవంతులు. తన భర్తకు బావగార్లిద్దరకన్న ఎక్కువ కట్నం ముట్టింది. తాను ఎంతో గొప్పగా సారె తీసుకు వచ్చింది. తన వంటిమీద నూరు తులాలదాకా బంగారం కన్నవారు పెట్టారు. కాని, తను నిరుద్యోగునిభార్య. తన పెనిమిటి ఇంటిల్లపాదిదృష్టిలో అతి చులకనగా చూడబడుతున్నాడు. పెద్ద భూస్వామి బిడ్డ అయివుండీ ఇంటిల్లపాదికీ అరవచాకిరీ చేస్తూంది. పెండ్లిలో భర్తను చూచి చదువుకున్న భర్త అంతమైనవాడు తనకు లభ్యమైనందుకు పొంగిపోయింది. అందమైన గులాబిపూవు కంటకావృతమైవుందని ఆ బాలహృదయానికి తట్టలేదు. గొప్ప ఉద్యోగస్తుని భార్యను అవుతాననుకుంది. ఎన్నో మధురస్వప్నాలు కనింది. తన ఊహాసౌధాలన్నీ ఈవిధంగా కూలుతా యనుకోలేదు. ఇంటిలో బండచాకిరీ చేసినా మెప్పులేదు. అంట్లుతోమి, బట్ట లుతికి, వడ్లు దంచి నీళ్ళుతోడి చేతులు కాయలు కాచేయి. మాటమాటికీ తోడికోడళ్ల దెప్పుళ్లూ, ఆడదాని అదృష్టం ఇలాగుందని అత్తగారి సాధింపు స్మరణకు వచ్చి భోరున ఏడ్చింది. మనస్సులో ఇమిడివున్న దుఃఖమంతా పొంగి పొర్లి పైకి రావడంచేత హృదయం కొంత తేలికైంది. తనకు దానే ఓదార్చుకుని 'ఏనాటికైనా పడ్డవాళ్లు చెడ్డవాళ్లు కారు. కాలం మారక పోతుందా? ఎప్పటికీ ఇలాగే వుంటామా? నా భర్త ఏం అప్రయోజకుడా, చదువు రానివాడా' అని అనుకుని ధైర్యం తెచ్చుకుంది. భర్తమాట జ్ఞాపకానికి వచ్చేసరికి ఇంటికి ఇంకా వచ్చారో లేదో' అని గబగబ బట్టలు వుతికి బుజంమీద వేసుకుని ఇంటికి వచ్చింది. వుతికిన బట్టలు క్రింద పడకుండా జాగ్రత్తగా ఆరేసి తనగదిలోకి వెళ్లింది. ఈజీచైరులో భర్త శోషొచ్చినట్టు పడుకుని వున్నాడు. ఏడ్చి ఏడ్చి నిద్దరపోయినట్లు కళ్లదగ్గర నీళ్ల చారికలు ఎండిపోయి కనబడుతున్నాయి. భర్తముఖం చూడగానే శారదకు తిరిగి వెర్రిదుఃఖం వచ్చింది. కాని, సమాళించుకుని భర్త నుదుటిపై జీరాడుతూన్న ముంగురులను సవరించింది. ఆ మధురస్పర్శకు గంగాధరం కళ్లు విప్పి చూచేడు. ఎదురుగా శారద నిల్చునివుంది. లేచి భార్యను తన చేతుల్లోకి తీసుకుని "శారదా నువ్వు ఇంటికి వచ్చి ఎంత కష్టపడుతూన్నావు? ఇంకెవ్వరినైనా పెండ్లిచేసుకునివుంటే నీకీ పాట్లు వుండకపోవునుగదా, ఏజన్మాన చేసుకున్న పాపమో నావంటి నిర్భాగ్యుడికి-ఇంతలో పైమాట అనకుండా శారద తనచేతితో భర్తనోరు మూసేసింది.

"అలా గనకండి. పడిన గోడలు పడినట్లే వుండవు. మీరేం చదువురానివారా? అప్రయోజకులా? కాలం కలసి వస్తేగాని మన ప్రయత్నాలు ఫలించవు. వూరికే మనసు పాడుచేసుకోకండి."

"లేదు శారదా లేదు. నన్ను ఎన్ని మాటలన్నా నేను సహిస్తాను. కాని, అమాయకురాల్ని నిన్ను పట్టుకుని ఇంట్లోవాళ్లు పెట్టేబాధలు చూడలేకుండా వున్నాను. ఇదివరకూ నాన్నగారు నన్నెన్ని మాటలన్నా సహించాను. కాని పరాయి పెద్ద మనిషిదగ్గర కన్న కొడుకన్న భావం లేశమాత్రం లేకుండా కామరాజుగారితో నాన్నగారు అతినీచంగా నా గురించి మాట్లాడేరు. ఆ మీద ఇంట్లో కొచ్చేసరికి మావదినెగార్లిద్దరూ నిన్ను చెట్టును దులిపేటట్టు దులుపుతూన్న మాటలన్నీ విన్నాను. నామనస్సు చాలా విరిగిపోయింది. నే నిక ఈ ఇంట్లో నిముషం వుండను. వచ్చి మంచినీళ్లు ముట్టను. నీవు అనుగ్రహించి అనుమతియ్యి. ఎక్కడికైనా పై దేశాల కెళ్లి ఉద్యోగం సంపాదించి నిన్ను తీసుకెళ్లిపోతాను. ఒక్కరెండు నెలలు నీవు ఈబాధలు ఓర్చుకొనివుంటే నిన్ను ఈ నరకకూపంలోనుంచి స్వర్గధామానికి తీసుకెళ్లుతాను. నిన్ను సుఖపెట్టవలశిన బాధ్యత నాది. నా బాధ్యత నేను నెరవేర్చుకుంటాను.

"అమ్మయ్యో మిమ్మల్ని వదలి నేను క్షణం వుండగలనా? నావల్ల కాదు బాబూ! ఎవ రెన్ని అన్నా, ఎంత పని చేసినా మిమ్మల్ని చూచుకునేసరికి అంతా మర్చిపోతాను. మీ ముఖం చూస్తాంటే ఏదో గంధర్వలోకంలో విహరిస్తూన్నట్టుంటుంది. నాకు చెప్పలేని ఏదో ఆనందానుభవం కలుగుతూంటుంది. మీ రేం చెప్పినా

(27-వ పేజీ చూడండి)

SPLENDID SELECTION
MADE IN FAMOUS SWISS FACTORIES
EACH GTD. FIVE YEARS



5JEWELS CHROME 30/- ROLLED GOLD 33/-
7JEWELS CHROME 35/- SUPERIOR 38/-
15JEWELS " 44/- ROLLED GOLD 48/-



5JEWELS CHROME 28/- ROLLED GOLD 33/-
7JEWELS CHRME 33/- SUPERIOR 35/-
15 JEWELS " 42/- ROLLED GOLD 45/-



FULLY JEWELLED 19/- SUPERIOR 21/-
WITH RADIUM 21/- CENTRE SECOND 23/-
SPECIAL HIGH CLASS MACHINE 27/-



5JEWELS CHROME 26/- ROLLED GOLD 32/-
7JEWELS CHROME 32/- ROLLED GOLD 36/-
15JEWELS " 48/- ROLLED GOLD 58/-



5JEWELS CHROME 22/- SUPERIOR 25/-
5 " ROLLED GOLD 30/- SUPIRIOR 33/-
15 " CHROME - 45/- ROLLED GOLD 55/-
TIME PIECE - 20/- SUPERIOR 25/-
POCKET WATCH 12/- SUPERIOR 15/-
Postage extra. Free on order for two
H. DAVID & CO.
POST BOX NO 11424 CALCUTTA

# ఉద్యోగం పురుష లక్షణమ్

(11-వ పేజీ తరువాయి)

సరే నేను మిమ్మల్ని వదిలివుండలేను. నన్ను కూడామీతో తీసుకెళ్లండి." అని భర్త కళ్లల్లోకి సూటిగా చూసింది.

"అలాగంటే ఎలాగ శారదా! నామాట విను. ఒక్క అరవై రోజులోపిక పట్టు. నా మాట నిలుపుకుంటానో లేదో చూడు." అని భార్య గడ్డం పట్టుకు లాలించాడు.

"సరే అయితే మీ మాట జవదాటడం నా కిష్టంలేదు. తప్పక అరవై ఒకటవ రోజు మీరు రావలశిందే. అలాగనక రాకపోతే నేను ఏ నుయ్యో గొయ్యో చూసు కొంటాను."

"నీ పుణ్యం వుంటుంది అటువంటి పని పెట్టుకు చెయ్యకు. ఒక రోజు అటూ ఇటూ ఐతే అవుతుంది."

"అదిగో అప్పుడే మొదలుపెట్టేరే. ఒక రోజల్లా ఒకవారం, వారం అల్లా నెలాఅలాగ మట్టుకు చేయకండి. సరి కాని, నా దొక్క చిన్నమనవి. మీరు కాదు పొదనడానికి వీలులేదు. నాకు మావాళ్లిచ్చిన మూడు పేటల గడియారపుగొలుసు ఇవాళ అమ్మేసి ఆ డబ్బు మీరు రైలుఖర్చులకు తీసుకెళ్లాలి." ఇంతవరకూ రైలుఖర్చులమాట గంగాధరం ఆలోచించనేలేదు. మాట జ్ఞాపకం చేసి తన వంటిమీద బంగారం ఇస్తానని భార్య అన్నందుకు ఆమె కుశాగ్ర బుద్ధికి ఔదర్యానికి మనస్సులో ఎంతో మెచ్చుకున్నాడు. కొంచెంసేపు ఆలోచించి "బంగారం అమ్మడం సులభం. కాని, తిరిగి మళ్లా కొనడం చాలా కష్టం"

"ఆఁ పోనిద్దురూ మీరు వుద్యోగం చేస్తే నాకు కావలసినన్ని నగలు చేయిద్దురుగాని, అవసరానికి పనికిరాని వస్తువు వున్నా ఒకటే లేకపోయినా ఒకటే. నా మెళ్లో ఇంకా నాను పేటలు, చంద్రహారాలు వున్నాయిగా మీరు మరొకమాట చెప్పవద్దు."

ఇక విధిలేక భార్యఇచ్చిన గొలుసు తీసుకుని రాజమండ్రీ ప్రయాణమైనాడు. అంతవరకూ తాను ఎక్కడికి వెళ్లడానికి నిశ్చయించుకోలేదు. చుక్కాని లేని పడవలాగు తాను పడవలో కూర్చున్నాడు. రాజమండ్రి వచ్చిన తరువాత ఎక్కడికి వెళ్లను? అని ప్రశ్నించుకున్నాడు. చివరకు వర్తక కేంద్రమయిన బొంబాయి పట్నాని కెళ్లడానికి నిశ్చయించుకున్నాడు.

* * * *

బెజవాడ స్టేషనులో జనం కిటకిటలాడుతున్నారు. వివిధ ప్రాంతాలకు రైలుమార్గాలుండడంనుంచీ అన్ని రకాలమనుష్యులు కనపడుతారు. అందులో తెల్లవారుఝామున నాలుగుగంటలకు ఇటు నైజాము బండీ, కలకత్తాకు పోవు మెయిలు, అటు మెడ్రాసువెళ్ళే పాసింజరు, బందరుబండీ, మాచర్ల పోవు బండీ ఒక్కసారిగా బయలుదేరుతాయి. అందుచేత ఆ టయిములో స్టేషను మరీ కోలాహలంగా వుంటుంది. గంగాధరం బొంబాయి వెళ్లుటకు నైజాముబండీ ఎక్కేశాడు. రైలు కదులుటకు ఇంకా గంట ఆలస్య మున్నప్పటికీ కదలితే జాగా దొరకదనే భయంచేత మూడవతరగతి బండ్లలో కూర్చున్న వారెవరూ కదులుటకు సాహసించటం లేదు. రెండవతరగతి ప్రయాణీకులుమాత్రం 'ఎవరు మా కింక సాటి' అన్నట్లు బోరలు విరుచుకుని ప్లాట్ ఫారంమీద నడుస్తున్నారు. వ్యర్థంగా ఖర్చు పెట్టుకుంటే ఉద్యోగం దొరికేదాకా ఇబ్బందిపడతానని దూరదృష్టితో గంగాధరం మూడవ తరగతి టిక్కట్టు తీసుకున్నాడు. జనసమూహం ఎక్కువ అవడంనుంచీ రైల్లో చాలా వుడికిపోతోంది. ఇంతలో మెల్లిగా రైలు పూర్ణగర్భవతిలాగ కదిలింది. కొంచెం సేపటికి రైలు డోర్నకల్ స్టేషనులో ఆగింది. ఎక్కే జనం ఎక్కుతున్నారు. దిగే జనం దిగుతున్నారు. ఆ గుంపులో తప్పించుకుని ఒక వృద్ధ బ్రాహ్మడు గంగాధరం కూర్చున్న బండిలోకి ఎక్కి ఇతని ప్రక్కనే చోటుచేసుకుని కూర్చున్నాడు. రైలుచక్రాలలాగే గంగాధరం తలలో ఆలోచనలు పరుగెట్టుతున్నాయి. ఇంటిదగ్గర పరిస్థితు లెలాగ వున్నాయో తన భార్యను ఏమేమి బాధలు పెట్టుతున్నారో, తాను బొంబాయి కెళ్లి ఎచ్చట దిగాలో ఏమి చేయాలో ఏమీ తోచటంలేదు. భవిష్యత్కాలపరిస్థితు లగమ్యగోచరంగా వున్నాయి. ఏమీ పాలుపోవడంలేదు. ఆలోచనాప్రవాహంలో పడి కొట్టుకుంటూన్న గంగాధరానికి తన ప్రక్కనే కూర్చున్న ముసలిబ్రాహ్మడు ఈవిధంగా ప్రశ్నించడం వినిపించింది.

"ఏవూరు వెళ్లుతారు బాబూ?"

"బొంబాయి."

"ఏదన్నా పనిమీద వెళ్లుతున్నారా!

"పని ప్రయత్నంమీద వెళ్లుతున్నాను."

"అలాగా మీకు పెండ్లయిందా?"

"ఆఁ అయింది."

"తల్లీ దండ్రీ బాగున్నారా?"

"నిక్షేపంలా వున్నారు."

"అన్నదమ్ము లెంతమంది బాబూ?"

"ముగ్గురం వున్నాము."

"మీరు ఎన్నోవారు?"

"నేనే ఆఖరువాడిని."

"మీ రెక్కడినుంచి వస్తూన్నారు?"

ఏదో పరధ్యానంగా ఆలోచిస్తూ గంగాధరం "గుంటూరు"నుంచి అని జవాబు చెప్పేడు.

"మీరేం చదువుకున్నారు బాబూ?"

"బి. యే. పేసయినాను."

"అంత పెద్ద చదువు చదివికూడా మన దేశంలో ఉద్యోగం దొరకలేదా మీకు? దేశంకాని దేశం వెళ్లుతున్నారు?"

"ఆఁ ఏదోలెండి - దేశంకూడా చూచినట్లుంటుందని వెళ్లుతున్నాను."

"మన అత్తవారు స్థితిమంతులేనా?"

"ఆఁ నలభయి, ఏభయి యెకరాల భూస్వామి."

"అలాగా సంతోషం. మన యింటి పేరు?"

"రాచకొండవారు."

"నాన్నగారి పేరేమిటి?"

"వెంకప్ప అవధాన్లుగారు?"

"మీకు అప్పచెల్లెళ్ళు ఎంతమంది నాయనా?"

"లేరండీ"

"మీ స్వస్థలం గుంటూరేనా?

"కాదు."

"మరేవూరు?"

"అమలాపురం?"

"అయితే గుంటూ రెందుకెళ్లేరు?

ఈ ముసలాయన అడిగే ప్రశ్నపరంపర కంతు కనబడటంలేదు. గంగాధరానికిచాలా విసుగెత్తింది. మరొక పక్కకు ముఖం తిప్పేసుకున్నాడు. తన ప్రశ్నకు జబాబు చెప్పలేదని ఆబ్రాహ్మడు తిరిగి "మీరు గుంటూరు ఎందు కెళ్ళేరో చెప్పేరు కారు." అని అడిగేడు.

గంగాధరం విసుగుతో "నాగ్రహచారం చేత" అని జబాబు చెప్పేడు. అది విని ఆ బ్రాహ్మణు సానుభూతి చూపించే స్వరంతో "అయ్యో ఏం నాయనా ఎవరికయినా సుస్తీచేసిందా? కుర్గరుఆసుపత్రిలో మందు పుచ్చుకొందుకు వెళ్లేరా? ఎవరికి సుస్తీచేసింది? నింపాదిగా వున్నారా? అపాయం ఏం జరుగ లేదు కదా?" అని తిరిగి ప్రశ్నించాడు.

దానితో గంగాధరానికి మరింత వొళ్లుమండింది. ఇక అక్కడ కూర్చుంటే లాభం లేదనీ అవతల బల్లమీదకు వెళ్లి కూర్చున్నాడు. అంతటిలో ముసలాయన గంగా

ధరాన్ని వదలలేదు. తానుకూడా ఆ బల్లమీకిది వెళ్లికూర్చుని" అక్కడకన్నా ఇక్కడ విశాలంగా వుందని కూర్చున్నారా? నే నడిగిన ప్రశ్నలకు జబాబు చెప్పేరుకారు. ఇంక గంగాధరం కోపం పట్టలేకపోయాడు.

"ఇక్కడ విశాలంగా వుందని రాలేదు. మీబాధ తప్పించుకుందామని వచ్చేను. మీ ప్రశ్నపరంపర కంతు కనబడడంలేదు. రైలెక్కినదగ్గరనుంచీ నన్ను ఇలాగ చంపుతున్నారు. నాకు పెండ్లయితే మీ కెందుకు, నా కన్నదమ్ములు అక్కచెల్లెళ్లు ఎంతమందయితే మీ కెందుకు, మా అత్తవారి ఆస్తిపాస్తివిషయం మీ కెందుకు, ఒక్కలాగ నాకు డబ్బా రాస్తున్నారు. ఏదో యోగక్షేమానికి అంటే మీ రడిగిన మాటల్లో రెండుమూడు మాటలు చాలు నే! నేను అడగాలంటే మిమ్మల్ని లక్షప్రశ్నలు అడగ్గలను. మీ రేం చదువుకొన్నారు? వేదమా? శాస్త్రమా? వేదం చదివితే శాస్త్రం ఎందుకు చదవలేదు? శాస్త్రమయితే వేదం ఎందుకు చదవలేదు? మీకు పిల్ల లెంతమంది? మనుమలు, మునిమనమలు ఎంతమంది? వాళ్ల కాపరాలు? ఇవన్నీ అడిగితే లక్షయేభయివేల ప్రశ్నలడగవచ్చును. ఎందుకీ చొప్పదంటు ప్రశ్నలు చెప్పండి. హాయిగా శ్రీరామజపం చేసుకోండి. నన్ను బాధపెట్టినట్టు ఇకమీద ఎవరినీ చంపుకుతినకండి."

ఇంతలో ఖాజీపేట స్టేషను వచ్చింది. భోజనానికని దిగిన గంగాధరం ఈసారి ఇంకో పెట్టెలోకి ఎక్కేడు.

* * *

బొంబాయిలో దిగిన గంగాధరం రైల్లో ప్రయాణీకుల సలహా అనుసరించి ఒక హోటల్లో బస చేసేడు. వారంరోజులపాటు వూరికే వూరంతా తిరిగేడు. ఒక వారం ప్రతీ ఆఫీసుకు వెళ్లి చూచేడు. ఇంకొకవారం ప్రతీ ఫ్యాక్టరీలోకీ వెళ్లి ఏమున్నా పనులున్నాయేమో అని కనుక్కున్నారు. ఎక్కడా ఉద్యోగం దొరికే సూచన కనబడడం లేదు. రైలుఖర్చులక్రింద భోజనంక్రింద తెచ్చుకున్న డబ్బులో సగందాకా ఖర్చయిపోయింది. ఒకనాడు అదేవిధంగా కొన్ని ఫ్యాక్టరీల్లో తిరిగి తిరిగి అలసిపోయి కొంచెం టీ తీసుకుందామని ఎదురుగా ఉన్న ఒక పెద్ద హోటలులోకి వెళ్ళేడు. ఎక్కడా సీట్లు కాళీ లేవు. ఒకమూల ఒక బల్లదగ్గర వున్న రెండు కుర్చీలలో ఒక కుర్చీ కాళీగా వున్నందున అక్కడికెళ్లి కూర్చుని జేబురుమాలుతో మొగం తుడుచుకొని సర్వరుకి టీ, బిస్కట్లు తెమ్మని ఆర్డరిచ్చారు. ఎదురుగా కుర్చీలో కూర్చున్న వ్యక్తి తేరిపార చూచి "మీరు ఈ ప్రాంతంవారు కారని తోస్తూంది." అని ఇంగ్లీషులో అడిగేరు.

"అవునండీ నేను ఆంధ్రుణ్ణి. మాది గోదావరిజిల్లా అమలాపురం."

"ఓ అలాగ చెప్పండి. నేను మిమ్మల్ని చూడగానే మీరు ఆంధ్రులని అనుకున్నాను. నేనుకూడా తెలుగువాడినే. మాది నైజాముస్టేటు తెలంగాణా వరంగల్ జిల్లా." మీ రిక్కడికి ఏంపనిమీద వచ్చారు.

"ఉద్యోగం ప్రయత్నంమీద వచ్చేను. ఇంకా ఎక్కడా ఏమీ దొరకలేదు."

'అలాగా' అని కొంచెంసేపు ఆలోచించి "మిస్టర్. నేను ఈవూరులో ప్రస్తుతం ఒక ఫిలిండైరెక్టరు చేస్తూన్నాను. మాకు ఒక ఎక్స్ట్రాకి ఒకరు కావలసివున్నది. మీ కిష్టమైతే మీరు మా కంపెనీలో చేరవచ్చును. జీతం ప్రస్తుతం నెలకు రెండు వందల రూపాయ లిస్తాము. ఆతరువాత మీరు బాగా యాక్టుచేశారని మా ప్రొడ్యూసరుకు తోస్తే మీకు హీరోపార్టు ఇవ్వబడుతుంది. మీ 'ఫేస్కట్టు' చూస్తే మీరు సినిమాప్రపంచంలో బాగా వృద్ధి పొందగలరని నాకు తోస్తూంది. మీరు సమ్మతించినట్లయితే ఇప్పుడే నా కారులో మిమ్మల్ని మా సినిటోనుకు తీసుకువెళ్లుతాను." అని అన్నాడు.

"నేను ఆ పనికి పనికివస్తానని మీకు తోస్తే తప్పక వస్తూన్నాను. ఏ వుద్యోగం లేక అల్లాడుతున్న నాకు మీరు మహోపకారం చేసేరు."

"నాటివాడికి ఆ మాత్రం చెయ్యడం ఒక గొప్ప విషయమా? రండి ఇక వెళ్లుదాము" అని ఇద్దరూ లేచి సినిటోనుకు వెళ్లేరు.

తనకు వుద్యోగం దొరికినట్లు వెంటనే భార్యకు వ్రాసేడు. శారద భర్త ఎన్నడు వచ్చి తనను తీసుకు వెళ్లతాడా? అని చూస్తూంది. శారద మీద ఇంట్లో వాళ్లు ఇప్పుడంత ధూముధాము జేయడం లేదు.

ఒకనాడు మధ్యాహ్నం భోజనం చేసిన విస్తరాకులు వీధిలో పారేయుటకు వచ్చిన శారదకు ఒక కొత్తమోటారు తమ ఇంటి వేపు రావడం కనిపించింది. ఆశ్చర్యంగా చూస్తూ నిలబడింది. తన భర్తవెళ్లి రెండు నెలలు కావస్తూంది. ఒకవేళ తన భర్త మోటారులో వస్తూన్నాడా అని ఒక చిన్న ఆశారేఖ తలలో తళుక్కుమంది. ఇంతలో తమ వాకిట్లోనే మోటా రాగింది. అందులోంచి గంగాధరం ఫుల్ యూరోపియన్ డ్రస్సుతో దిగేడు. శారద ఆనందానికి అంతు కనబడలేదు. కలా? నిజమా? అని తెల్లబోయి చూస్తూంటే 'రా శారదా లోపలికి వెళ్లుదామని' గంగాధరం అన్నాడు. ఊరిలోవున్న కుర్రసజ్జంతా క్షణంలో మోటారుని చుట్టేశారు. ఇద్దరూ కలసి లోపలికి వచ్చేరు. గంగాధరం కూడా తీసుకొచ్చిన నౌక రిద్దరూ సామాను లోపల పెట్టారు. గంగాధరాన్ని చూచి ఇంటిల్లపాదీ సంతోషం కనబరచేరు. వెంకప్పావుధాన్లు కొడుకుని చూసి మొదటలాగ మండిపడం మానేసి తనకు నమస్కరించిన పుత్రుడుని మనఃపూర్తిగా ఆశీర్వదించాడు. అక్కడవున్న నాలుగురోజులు అందర్నీ మోటారులో గంగాధరం తిప్పేడు. ప్రతీ రోజూ వూరిలోవున్న జనం అందరూ గంగాధరాన్ని చూడడం కోసరం వచ్చేవారు. తన కొడుకు ప్రయోజకత్వాన్ని గురించి విధివిరామం లేకుండా అందరి దగ్గరా పొగిడి వెంకటప్పావుధాన్లు చెప్పేవాడు. సుబ్బమ్మ, రాజేశ్వరి, మట్టి మోటారుచూచి, నౌకర్లనిచూచి ఓర్వలేక ముక్కుమూతి తిప్పేవారు. ఇప్పు డెవ్వరేమనుకున్నా శారదకు లక్ష్యం లేదు.

తాను మొదట వూరంతా తిరిగినా ఎక్కడా వుద్యోగం దొరక్కపోవడం, ఒకనాడు ఫిలిండైరక్టరుతో హోటల్లో పరిచయం అవడం, వాళ్లకు సంతృప్తికరంగా తాను ఫిలింలో యాక్టు చేసినందున ఇంకొక ఫిలింలో హీరోగా తనను ఇరవై వేల రూపాయిలకు బుక్ చేయడం అడ్వాన్సుగా పది వేల రూపాయిలు తీసుకొన్నానని శారదతోమాత్రం గంగాధరం చెప్పేడు. పైవాళ్ళతోమాత్రం తాను ఏదో కంపెనీలో పని చేస్తూన్నాననీ నెలకు రెండువేలు జీతం అనీ వాళ్లే మోటారుకొనిచ్చారని చెప్పేడు.

"మీ శీలంమాత్రం జాగ్రత్తగా చూసుకోండేం" అని శారద హెచ్చరించింది. "పిచ్చిదానా నామీద నీకు నమ్మకం లేదా?" అని గంగాధరం జవాబిచ్చాడు.

అమలాపురంనుండి వెళ్లేనాడు. సామానులన్నీ నౌకర్లు కట్టేశారు. తీరా మోటారు ఎక్కేముందు గంగాధరం చిన్నవదినగారితో

## నారసింహలేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, విక్కాక, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం"

పెరిదేపి—నెల్లూరు జిల్లా.

# మా యిల్లు మ్యూజియం నేను మృగాన్ని

(15-వ పేజీ తరువాయి)

వివిధపరిణామ విశ్వసర్వస్వమంతా ప్రత్యక్షమంటే చాలదూ? "ఈ వకారగుణులన్నీ వాస్తవంగా ఉద్ధరించదగినవే!"-అని మన ఊహ; మనలనే ఉద్ధరించడాని కవతరించిన అపరశక్తులమని వాళ్ళ ఊహ. ఉభయత్రా స్థిరపడిన యీ రైలుపట్టాలు కలుసుకునే దెప్పుడు?

నేను నా శక్తియుక్తులన్నీ ఉపయోగించి శరణాలయాధికారులతో శతపోరినాను. వాళ్ల చరిత్ర వ్రాస్తాననీ, 'వకారగుడి వైభవ' మనేపేరు పెడతాననీ, యేమేమో వాగినాను. నే నెవతెను అభిలషిస్తానో ఆమె నన్నంగీకరించదు; నన్ను కోరే నారీమణిమీద నాకు బుద్ధిపుట్టదు. ఈ విధంగా చూచిచూచి, తుదకు విసిగి, వెనుకకు మళ్లినాను.

తరువాత గుంటూరు శారదానికేతనం నడిపే పుణ్యదంపతులను జన్మపావనంగా దర్శించి, నా కథ చెప్పుకున్నాను. 'ఎక్కడా గతిలేనివాళ్లకే యీ సంస్కార' మన్నట్టు వ్యంగ్యంగా వారభిప్రాయ సూచన చేసినారు.

తిరిగితిరిగి మద్రాసు చేరినాను. అక్కడ నా స్నేహితుడొకడు సంధిల్లినాడు. అతడన్నాడుగదా? "నీవు కులం వదలినావు; జాతి వదలినావు; మతం వదలినావు; ధర్మం వదలినావు; అభిమాన మెందుకు వదలవూ? నాకు తెలిసి, ఒకానొక ఊళ్ళో, ఒకఅనాఘ్రాతపుష్పం ఉంది. నిన్ను చూస్తే తప్పక అంగీకరిస్తుంది. ఐతే, నీవు నడుము పుట్టిముంచగూడదు. ఆమె కళావంతుల తెగకు చేరింది. నీకు భూసురత్వం ఊడుతుంది. ఒప్పుకుంటావా?"

ఆలోచించి ఆఖరుకు సరే నన్నాను. ఇద్దఱం ఆ రాత్రే రైలెక్కి తెల్లవారు జామున ఆ ఊళ్లో దిగినాము. ఇదీ ఒక విధమైన సంస్కారమే కదా? - అని సంతోషించినాను. అతడు చెప్పినట్టే అన్ని లక్షణాలూ సరిపోయినాయి. ఆదర్శ సంస్కర్తనైనాను. ఇంక వివాహం మాత్ర మెందుకూ? పనికిమాలిన మంత్రాలూ, ప్రాణసంకటాలైన ప్రమాణాలూ, ప్రాచీన సాంప్రదాయాలూ - అన్నిటికీ స్వస్తిచెప్పి అనంత స్వాతంత్ర్య మార్గాన్ని అవలంబించినాను. మన్మథుడే మా యిదఱనూ కూర్చినాడు. విద్యుద్దీపాల సువర్ణశోభలో అలౌకికమైన పద్మావతీప్రతిమ! - అన్నిటా పేరు సార్థకమయింది. కండ్లకు మిఱుమిట్లు గొలిపే ఆ రూపం చూచేకొద్దీ నాకొక విధమైన క్రొత్తరుచి పుట్టింది. ముందుకు వంగి ముద్దాడబోతుంటే, అంతర్వాణి ప్రబోధించింది. హఠాత్తుగా భీతి! -ఆందోళన!- జీవిత విప్లవం! - నేను తటాలున వెనుకకు తగ్గవలసి వచ్చింది.

"నీవు ద్రోహివి; దురాచారివి; నాస్తికుడవు; పరమపాపాత్మా పతితహృదయుడవు; నమ్మినందుకు నన్ను నాశనం చేస్తావా? జాగ్రత!"-అని పండ్లు పటపట కొఱుకుతూ ఉఱిమిచూచే ఉద్దండశక్తి నాముందు ప్రత్యక్షమయింది. ఆ వాణి వీనుల్లో విస్పష్టంగా మ్రోగింది. ఒక్కసారిగా కండ్లకూ చెవులకూ కలిగిన బీభత్సంవల్ల బిత్తరపోయినాను. తేలమొహం వేసి దిక్కులు చూచినాను. అంతటా, అదే విశ్వరూపదర్శనం-హఠాత్తుగా మూర్ఛపోయినాను.

స్మృతి కలిగేప్పటికి, నేను నిజమైన మృగాన్ని. కాకుంటే, చిత్రంగా నా చుట్టూ మూగి, జన మెందుకు గోలచేస్తారు? నెమలి పింఛపు విసనకఱ్ఱవలె నా ప్రక్కను నిలిచియున్న పద్మావతి గాభరా యెందుకు ప్రకటిస్తుంది? నే నెందుకో నిబ్బరపడినాను. ఆద్యంతాలు జ్ఞాపకం చేసుకుంటూ ఆ సుడిగుండంలోనుండి తప్పించుకోడానికి మార్గం వెదకినాను. తటాలున లేచి, తల వంచుకొని, వీధిలోనికి వెళ్లి, "మీ రంతా యెవరు? నేను మృగాన్ని దారి వదలండి!"- అని వెఱ్ఱిగా గర్జించినాను. కొందఱు భీతిపడినారు; కొందఱు నవ్వినారు; మఱికొందఱు, "వీ డెవడో పిచ్చివాడురా!"-అని గుసగుస లాడినారు.

★

---

"చిన్నవదినా నీవానాడు శారదతో, 'నచ్చవలేకపోతే మోటారు కొనమను' అన్నావు. నీనోటివాక్యం ఫలించింది. నీకు నమస్కారం. పెద్దవదినా మీరీ మారు బొంబాయివస్తే మా శారద నౌకర్లు మీకు అన్నీ సిద్ధంగా అమరుస్తారు. తప్పకరండి. అని చెప్పి అందరికీ నమస్కారం చేశేసు. ఇద్దరు వదినగార్లు ఏమీ జవాబు చెప్పలేక సిగ్గుతో తలలు వంచేసుకున్నారు. తల్లిదండ్రిమాత్రం అప్పుడప్పుడు క్షేమసమాచారం తెల్పుతూవుండండి అనిగద్గదిక కంఠంతో అన్నారు. తల్లి కుమారుని వదలవలసి వచ్చిందని కంట నీరు పెట్టుకుంది. ఎంతయినా కన్నప్రాణం కదా! "ఉద్యోగం పురుషలక్షణం అనివాడు సుఖంగా ఉద్యోగంచేస్తూ కాపురం పెట్టుకుందుకు వెళ్లుతూంటే కంట నీ రెందుకే వెఱ్ఱిదానా" అని వెంకప్పావధాన్లు భార్యతో అన్నాడు. శారద అందరకూ నమస్కరించి మోటారెక్కి ముందు సీటులో కూర్చుంది. నౌకరు వచ్చి కారు తలుపు మూసేసు. డ్రైవరు సీటులో గంగాధరం కూర్చుని కారు స్టార్టు చేసేసు.

★

---

## విన్నారా?

* యుద్ధానంతరం అమెరికన్ యుద్ధనౌకలకు అమెరికన్ కాంగ్రెసు చాలా తక్కువ ధరలు నిర్ణయించి విక్రయించడంవల్ల జోసఫ్ కేసీ, అడ్మిరల్ హాల్సీ, ఎడ్వర్డ్ స్టెటినియస్‌లు లక్ష డాలర్ల పెట్టుబడితో 28 లక్షలు లాభం సంపాదించారు.

* ఫోర్ట్ వర్త్, టెక్సస్, లెక్సింగ్టన్ రాష్ట్రాలలోని ఆస్పత్రులు నాలుగేళ్లక్రిత 26 మంది యువకులను, మాదద్రవ్యాలకు అలవాటుపడ్డవారిని చేర్చుకున్నాయి. ఇట్టివారి సంఖ్య ఇప్పుడు 700కు పెరిగింది.

* బార్సిలోనా(స్పెయిన్)లో ఇటీవల జరిగిన సమ్మెలూ, ఫ్రాంకో వ్యతిరేక ప్రదర్శనాలూ చూసి పశ్చిమరాజ్యాల నౌకా, విమాన స్థావరంగా స్పెయినును వినియోగించేవిషయమై అమెరికను సైనికశాఖాధికారులు నిరుత్సాహం చెందుతున్నారు.

* నిరుద్యోగంతో బాధపడుతున్న ఒక జపానీవాడు, 50 వేల యెన్‌లు ఇచ్చిన వారికి యావజ్జీవ దాస్యం చేస్తాననీ, లేనిపక్షాన తన భార్యనూ, నలుగురు బిడ్డలనూ చంపి తానూ చస్తాననీ "యొమియురీ" అనే టోక్యో దినపత్రికలో ప్రకటన వేశాడు. ఆ పత్రిక ఈ ప్రకటనను ఉచితంగా వేసింది.

• 1945 ఆగస్టు 6 న హిరోషిమానగరం మీద మొదటి అణుబాంబు పడ్డచోట 30 అడుగుల ఎత్తుగల స్తంభం కట్టి దానిపైన 90 పౌనుల బరువుగల "శాంతి గంట"ను హిరోషిమా పౌరులు - అణుబాంబునుండి తప్పించుకున్నవారు - ఏర్పాటుచేశారు. ఇటీవల ఈ గంటను ఎవరో దొంగిలించారు. హిరోషిమా పురపాలకులు దొంగకు "సిగ్గు లేదు," అని ప్రకటించారు.